క్లుప్తంగా

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అనంతరం ఆలయ మండపంలో సుదర్శన హోమం, భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. రాత్రి ప్రాకారోత్సవం, భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

గంగమ్మ నిమజ్జనం

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులపాటు గంగజాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని తవణంపల్లె, దిగువ తడకరలో బుధవారం గంగమ్మకు అభిషేకం, పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చారు. అనంతరం మంగళవాయిద్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలో గురువారం శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారికోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు శారదమ్మ మల్లయ్య, కనకమ్మ, గోవిందస్వామి తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా గురువారం నుంచి శనివారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, స్వామి వారి కాలజ్ఞాన భజన సంకీర్తనలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి గ్రామోత్సవాన్ని చేపట్టనున్నట్లు వివరించారు.

అలరించిన అర్జున తపస్సు



కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లెలో శ్రీద్రౌపదీ దేవీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేకువ జామున ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం ద్రౌపదీదేవీ, శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో తపస్సు మాను కార్యక్రమం ప్రారంభమైంది. అర్జున వేషధారి పరమశివుని వరం కోరుతూ పద్యాలతో కీర్తిస్తూ తపస్సుమాను అధిరోహించారు. అక్కడి నుంచి వెంట తీసుకెళ్లిన వీబూది, నిమ్మ పళ్లను కిందికి విసిరారు. వీటిని అందుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. ఈ క్రమంలో సంతాన వరం కోసం పలువురు మహిళలు తడి బట్టలతో తపస్సు మాను చుట్టూ వరపడ్డారు. అర్జున తపస్సుమానుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఆలయ ధర్మకర్తలు ధనగిరిరెడ్డి, బాబురెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.


తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి



చిత్తూరు: పాలబిందెపై అమ్మవారిని తీర్చి మొక్కు తీర్చుకుంటున్న భక్తురాలు, సంతపేట అమ్మవారు, నడివీధి గంగమ్మ తల్లి, తవణంపల్లె మండలం దిగువతడకరలో కొలువైన గంగమ్మ



వెళ్లిరావమ్మా.. గంగమ్మా!

- కనులపండువగా అమ్మవారి ఊరేగింపు
- వినూత్న రీతిలో ఓంశక్తి విన్యాసాలు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన నిమజ్జన మహోత్సవం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో గంగజాతర బుధవారం ముగిసింది. రెండు రోజుల పాటు గంగమ్మ తల్లి విశేష పూజలందుకుంది. దర్శనార్థం భక్తులు మండపాల్లో కిటకిటలాడారు. జన జాతర నడుమ అమ్మవారి ఊరేగింపు కనులపండువగా సాగింది. చివరకు గంగ ఒడికి చేరుకుంది. నిమజ్జన యాత్ర సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వేడుకగా కొనసాగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా ఓంశక్తి విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పువాయిద్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అడుగడుగునా అమ్మవారికి పసుపువళ్లాలతో హారతులు పట్టారు.

చిత్తూరు నగరంలోని నడివీధి గంగజాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం నడివీధిలో కొలువుదీర్చి రెండో రోజు అంటే బుధవారం నిమజ్జనానికి తరలించడం ఆనవాయితీ. ఈ క్రమంలో వంశ పారంపర్య ధర్మకర్త కుటుంబీకులు పొన్నియమ్మకు(గ్రామదేవత) విశేష పూజలు చేశారు. సారె సమర్పణలో భాగంగా ఆలయం నుంచి ఊరేగింపుగా నడివీధికి బయలుదేరారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నయండి, డప్పు వాయిద్యాల నడుమ సారె, గజమాలను తీసుకెళ్లారు. ధర్మకర్త అమ్మవారికి గజమాల వేసి, సారె సమర్పించడంతో ఊరేగింపు ప్రారంభమైంది. హైరోడ్డు నుంచి ఊరేగింపుగా వస్తున్న అమ్మవారికి భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు, మంగళహారతులు పట్టి తరించారు. ఊరేగింపు అర్ధరాత్రి వరకు కొనసాగింది. కట్టమంచి చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేయడంతో జాతర ఘట్టం ముగిసింది. తర్వాత నడివీధిలోని అఖండ దీపాన్ని కొండెక్కించారు. కొంగారెడ్డిపల్లిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి జలధి కార్యక్రమాలు ముగిశాయి. సంతపేటలో మేళతాళాలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలు, ఓంశక్తి విన్యాసాలతో అమ్మవారిని ఊరేగించి, జాతర మహోత్సవాన్ని పూర్తి చేశారు. గిరింపేటలో కూడా గంగమ్మ ఊరేగింపును భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్చుతూ సంబరాన్ని అంబరాన్నంటేలా చేశారు. దొడ్డిపల్లి, మురకంబట్టు, ఓబనపల్లి, తదితర ప్రాంతాల్లో సైతం అమ్మవారిని నిమజ్జన కార్యక్రమాలు నేత్రానందంగా సాగాయి. డప్పు దరువుకు చిత్తూరు వాడవాడలా దద్దరిల్లింది. నిమజ్జనంలో భాగంగా పలుచోట్ల అన్నదానాలు చేశారు. మజ్జిగ, చల్లని పానీయాలు పంపిణీ చేశారు.


చిత్తూరు చర్చివీధిలో జనసందడి

ఓంశక్తి విన్యాసాలు

గంగ జాతరను పురస్కరించుకుని ఓం శక్తి భక్తులు వినూత్న రీతిలో మొక్కులు చెల్లించుకున్నారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో తొలుత స్వామి విశేష పూజలు చేశారు. తర్వాత 40 రోజులపాటు ఉపవాసదీక్షలు చేపట్టిన భక్తులు నోటికి శూలాలను గుచ్చుకుంటూ వచ్చారు. కొందరు నోటికి శూలాలు గుచ్చుకుంటే మరికొందరు వీపునకు కొక్కీలు గుచ్చుకున్నారు. ఇంకొందరు శరీరమంతా నిమ్మకాయలు గుచ్చుకుని కనిపించారు. వీరంతా చర్చివీధిలో బారులు తీరారు. 8 గంటల సమయంలో కొక్కీలు గుచ్చుకున్నవారు లారీల్లో వేలాడుతూ కొందరు, ఆటోలను లాగుతూ మరికొందరు, అమ్మవారి ప్రతిమతో కూడిన రథాన్ని కదలిస్తూ ఓంశక్తి భక్తులు చేసిన విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. చర్చివీధి నుంచి ర్యాలీగా హైరోడ్డుకు చేరుకుని అమ్మవారికి భక్తుడు లారీలో వేలాడుతూ క్రేన్‌సాయంతో గంగమ్మకు గజమాల సమర్పించాడు. అమ్మవారు భక్తుల సందోహం నడుమ కట్టమంచి చెరువులో గంగ ఒడికి చేరారు. ఓంశక్తి విన్యాసాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో చర్చివీధి కిక్కిరిసింది.

ట్రాఫిక్ మళ్లింపు

అమ్మవారి నిమజ్జనంలో భాగంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ముందుగా ట్రాఫిక్ మళ్లించారు. నిమజ్జనానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూశారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుశాఖ నిఘా వ్యవస్థను పటిష్టం చేసింది. దీంతో జాతర ఘట్టం అర్ధరాత్రి వరకు ప్రశాంతంగా ముగిసింది. అడుగడుగునా పోలీసులు నిఘాపెట్టారు. రెండు రోజులపాటు పోలీసులు నిఘాను పకడ్బందీగా నిర్వహించారు. దీంతో గంగజాతర వేడుక చిత్తూరు నగర వ్యాప్తంగా ప్రశాంతంగా పూర్తయింది.




వీపునకు కొక్కీలు గుచ్చుకుని లారీని లాగుతున్న ఓంశక్తి భక్తులు, పుష్ప-2 వేషధారణలో అలరించిన యువకుడు, నోటికి శూలం గుచ్చుకుంటున్న ఓంశక్తి భక్తులు


దప్పు వాయిద్యం




వీపులో కొక్కీలు గుచ్చుకుని మొక్కు చెల్లించుకున్న ఓం శక్తి భక్తుడు, వీపునకున్న కొక్కీలతో వేలాడుతున్న ఓంశక్తి భక్తులు, వీపునకున్న కొక్కీలతో ఆటో లాగుతున్న భక్తుడు


బందోబస్తు విధులకు హాజరవుతున్న పోలీసులు

పెట్రోల్‌ను క్యాన్లలో విక్రయించొద్దు

పూతలపట్టు: ఎన్నికల నియమావళి ప్రకారం పెట్రోల్, డీజిల్ వంటి వాటిని క్యాన్లు, బాటిళ్లలో విక్రయించరాదని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మండలంలోని ఆర్వో కార్యాలయంలో బుధవారం పెట్రోల్ బంక్ యాజమానులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకు నుంచి పెట్రోల్, డీజిల్ కంటైనర్స్, బాటిళ్లకు, డ్రమ్స్‌కు, ఎటువంటి పాత్రలకు సరఫరా చేయకూడదని తెలిపారు. అలా చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు మండల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా ఉంటుందన్నారు. పెట్రోల్ బంకు యజమానులు నియమాలను ఉల్లంఘించినట్లైతే వారి పెట్రోల్ బంక్ బి–ఫారం రద్దవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, డీటీలు కవిత, మునికృష్ణ, మహేశ్వరి, పెట్రోల్ బంక్ యజమానులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

జోడిచింతలలో ఉచిత గుండె వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

యాదమరి(బంగారుపాళెం): మండలంలోని జోడిచింతల గ్రామంలో బుధవారం సుచి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉచిత గుండె వైద్య శిబిరానికి విచేసిన 110 మందికి కోలార్ నారాయణ హార్ట్ సెంటర్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందిని నారాయణ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు పీఆర్‌ఓ నరేష్ తెలిపారు. గుండె జబ్బు ఉన్నట్లు నిర్ధారణ అయితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్సలు నిర్వహించి ఆపరేషన్లు చేస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పాల్‌విజయకుమార్, గ్లోరి విజయకుమార్, డాక్టర్లు కిరణ్‌కుమార్, మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ నిమజ్జనం


బంగారుపాళెం: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని ముంగరమడుగు దళితవాడలో బుధవారం గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. బుధవారం తెల్లవారు జామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. విశేషంగా అంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ జలప్రవేశానికి తరలించారు.

ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు


బండపల్లి అమ్మవారు

పూతలపట్టు: మండలంలోని బండపల్లిలో గంగమ్మ జాతర రెండో రోజు బుధవారం నిమజ్జనం అంగరంగ వైభవంగా సాగింది. మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారు పుర వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపు అనంతరం అమ్మవారిని చెరువులో నిమజ్జనం చేశారు. గంగజాతరలో భాగంగా ప్రతి సంవత్సరం ఓంశక్తి భక్తులు విన్యాసాలతో వారి మొక్కులను చెల్లించుకున్నారు. వీపు, నోరు, శరీర భాగాలకు శూలాలను గుచ్చుకొని, వరుసలో నిలుచున్నారు. నోటికి శూలాలుగా గుచ్చుకున్న వారు ర్యాలీగా వెళ్తే, మరికొందరు లారీ, ఆటో, ట్రాక్టర్లకు వేలాడుతూ విన్యాసాలు చేశారు. ఇందుకోసం భక్తులు పది రోజుల నుంచి దీక్షలో ఉన్నట్లు తెలిపారు. కొక్కీలతో వేలాడుతూ అమ్మవారికి గజమాలను సమర్పించడంతో వారి దీక్షలు ముగిశాయి. దాదాపు 120 మంది ఇలా మొక్కులను చెల్లించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి పాల్గొన్నారు.


అమ్మవారు నిమజ్జనంలో ప్రజలు


నోటికి శూలాలు గుచ్చుకున్న భక్తులు


కొక్కీలకు వేలాడుతున్న ఓంశక్తి భక్తులు

గర్భిణులకు నిర్విరామంగా పౌష్టికాహారం


పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు/నగరి: నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో బుధవారం వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మంత్రి ఆర్కే రోజా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యధావిధిగా విజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీ, పచ్చడి, సాంబారు, రసం, పెరుగన్నం, చిక్కీ, అరటిపండును అందించారు.